మినీ కథ

# సైకిల్

కె. శివరామారావు

సూర్యమోహన్‌కి ఆ రోజు సెలవు. పగలంతా హాయిగా నిద్రపోయి, సాయంకాలానికి అలా షికారెళదామని నీట్‌గా తయారై, సైకిలెక్కి హుషారుగా అంతకు ముందు రోజునే విడుదల అయిన ఓ సినిమాలోని పాట మనసులోనే పాడుకుంటూ వెళ్ళి కొంచెంసేపు సినిమా హాలువద్ద, పార్కు వద్ద కాలక్షేపం చేశాడు. వేసవికాలం కావడం వలన ఏదైనా చల్లని పానీయం త్రాగాలనిపించి "హనుమాన్ కూల్‌డ్రింక్ షాప్" ముందు సైకిలు స్టాండువేసి లోనికి వెళ్ళాడు.

సూర్యమోహన్ వెనుకనే లోనికి ప్రవేశించిన అతని మిత్రుడు రమేష్ "హల్లో సూర్యమోహన్, ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" అంటూ వెనుకనుంచి భుజంమీద చెయ్యివేశాడు, చాలా కాలానికి రమేష్‌ని చూడడంతో సూర్యమోహన్‌కి చాలా సంతోషమనిపించింది. కూల్‌డ్రింక్సు త్రాగి బిల్లు చెల్లించి బయటికొచ్చి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ అలా నడిచి పోయారిద్దరూ. కొంతసేపు అలా తిరిగాక రమేష్ మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. తను సైకిలుని "హనుమాన్ కూల్‌డ్రింకు షాప్" ముందే వదిలేసి వచ్చినట్లు గుర్తొచ్చి కంగారు పుట్టింది సూర్యమోహన్‌కి. దానికి తాళంకూడా లేదని తెలిసి గుండె గుభేలుమంది. ఉరుకులు పరుగులమీద కూల్‌డ్రింక్ షాప్ చేరుకున్నాడు. అదృష్టం! తన సైకిలు యధాస్థానంలో నిక్షేపంగా వున్నది. అక్కడికక్కడే హాయిగా మరో కూల్‌డ్రింకు గటగటా త్రాగి క్యాష్‌బాక్సు దగ్గర కనిపిస్తున్న ఆంజనేయస్వామి ఫోటోకి దణ్ణంపెట్టుకున్నాడు. తన మతిమరుపుని మన్నించి, ఆంజనేయస్వామి తనపై దయ చూపడంవల్లనే సైకిలు దొరికిందనుకున్నాడు. వెంటనే సైకిలెక్కి అక్కడికి మైలు దూరంలో వున్న ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి, గుడిముందు సైకిలుపెట్టి లోనికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి కొంత కానుక సమర్పించి, కృతజ్ఞతలు చెప్పుకుని బయటకు వచ్చాడు. గడపదాటి నిలబడి తన సైకిలు పెట్టినవైపు చూశాడు. సూర్యమోహన్‌కి కళ్ళు తిరిగినంత పనైంది. అక్కడ తన సైకిలు లేదు. కొబ్బరిముక్కలు కొరుక్కుతింటూ ఒక కోతి కూర్చుని వుంది!

"జ్యోతి" మే, 1978 సంచిక తరువాత కొనసాగింపు!




## ఇంతకు ముందు జరిగిన కథ

జగన్నాధం తండ్రి ప్లీడరు నారాయణమూర్తిగారు, వర్జ్యం, వగైరాలు చూసుకొని కానీ యే పనీ చేయడాయన—జగన్నాధాన్ని మెడిసిన్ చదివించడానికి గ్రహాలు ఒప్పుకోవనే కారణంతో నిరాకరిస్తే, తల్లి సుభద్రమ్మగారు కుటుంబ జ్యోతిష్కుడు భరతశాస్త్రికి అయిదొందలిచ్చి శాంతి చేసి జగన్నాధం మార్గం సుగమం చేసింది.

తాము అద్దెకున్న ఇంటిని భరతశాస్త్రి మాటసాయంతో—భర్తచేత కొనిపించింది సుభద్రమ్మగారు కొడుకుకోసమని. జగన్నాధం డాక్టరై బోర్డు కట్టి జానకి మెడలో తాళి కట్టిన అయి